# 33. మహారాజనటుడు

పాటియాలా సంస్థానాధీశులు మహారాజా భూపేంద్ర సింహజీవారు అఖండ మేధాసంపన్నులుగా సుప్రసిద్ధులు. వారు రాజకీయాల్లోనూ, రాస క్రీడల్లోనూ మాత్రమే గాక తత్వశాస్త్రం, వేదాంతం, సాహిత్యం అన్నీ మధించిన మహానుభావులని ప్రతీతి. శ్రీవారికి బైబిల్, ఖురాన్, భగవద్గీతలన్నీ కంఠోపాఠమని కూడా కొందరు సెలవిస్తారు.

అలాంటి మహారాజావారు అయిదవజార్జి చక్రవర్తి సిల్వర్ జూబిలీ ఉత్సవాలలో పాల్గొనేందుకు అక్షరాలా సకుటుంబ సపరివార సమేతంగా లండన్‌కు వేంచేసేరు. శ్రీవారి వెంట అరడజను మంది మహారాణులు, డజనున్నరమంది రాణులుతో సహా అరవైమంది పరివారం లండన్‌లో దిగేరు.

సామాన్యంగా చక్రవర్తి ఆహ్వానంపై విచ్చేసినవారు బకింగ్ హామ్ రాచప్రాసాదపు అతిధి గృహంలో విడిది చేస్తారు. కానీ, మహారాజావారు మాత్రం లండన్‌లోని ఖరీదైన సవాయ్ హోటల్లో సపరివారంగా విడిది చేసారు

ఉత్సవాలన్నీ పూర్తయ్యాక, వాటనింటా రాజోచిత లాంఛనాలతో పాల్గొన్నాక, మహారాజా భూపేంద్రసింహజీ వారికో అనుమానంవచ్చింది.

ఈ ఉత్సవాలకు రాజులూ, మహారాజులూ, కౌంట్లూ ఆదిగాగల ఘనా ఘన ఘనా పాఠీలెందరో విచ్చేశారు. చక్రవర్తిగారూ, ఆయన మంత్రులూ, సేవకులూ అందర్నీ ఘనంగానే స్వాగతం చెప్పి సత్కరిం

చారు బాగానే ఉంది. మరయితే నేను ఇంతమందిలో... ఈ శతద్విశత, పంచశత లింగాల్లో ఓ బోడి లింగాన్నేనా? నా కేం ప్రత్యేకత లేదా? చక్రవర్తిగారికి నేనసలు జ్ఞాపకం ఉంటానా? అని అనుమానం వచ్చింది

అందుకై సాహిత్యం, వేదాంతం, వగైరాలన్నీ ఆపోసనం పట్టిన మహారాజా భూపేంద్రసింహజీవారు తీవ్రంగా ఆలోచించారు.

ఆలోచించి ఆలోచించి, చివరికి మహారాజావారు చక్రవర్తి దర్శనాపేక్షులై అభ్యర్థనను పంపుకున్నారు.

చక్రవర్తిగారున్నూ బ్రిటిష్ సామ్రాజ్యానికి అత్యంత విశ్వాసపాత్రునిగా కొనియాడబడిన మహారాజా వారిని దర్శించేందుకు సంతోషం వెలిబుచ్చారు. అందుకై ఒక తేదీ, సమయం నిశ్చయం చేయబడ్డాయి.

చక్రవర్తిగారి దర్శనం చేసుకోవాలంటే ఎవరైనా సరే బకింగ్‌హాం ప్యాలస్ గేటు దగ్గర్నించి రాచదర్బారు చేరేలోగా అనేకానేక రాచమర్యాదల్ని పాటించాల్సి ఉంది. దాన్నుండి ఎవరికీ మినహాయింపు లేదు. అది చక్రవర్తిగారి దర్పానికి కొండ గుర్తు.

మహారాజావారు చక్రవర్తి దర్శనం చేసుకోవలసినరోజు వచ్చింది. ఆ ఉదయం పదకొండు గంటలకు మహారాజావారు ఖుద్దున బకింగ్‌హాం ప్యాలస్‌లో హాజరు వేయించుకోవలసి ఉన్నారు.

కానీ...

అ సమయానికి మహారాజావారు తనున్నహోటల్లోనే మహారాణుల్తో మూడు ముక్కలాట ఆడుతూ ఖుషీచేస్తూ ఉండిపోయేరు.

సమయం మించిపోతోందని మంత్రులూ, కార్యదర్శులూ పదే పదే హెచ్చరించేరు. బకింగ్‌హాం ప్యాలస్ నుండి చక్రవర్తిగారి కార్యదర్శులు కూడా అసహనంతో, ఆగ్రహంతో ఉడికిపోతూ ఫోన్లమీద కబుర్లుచేసేరు.

చక్రవర్తిగారేమో అతిథుల్ని అందుకునే రాచదర్బారులో సింహాసనా రూఢులై మహారాజావారి కోసం పడిగాపులు పడి ఉన్నారు.

కానీ... మహారాజావారు పన్నెండువ్వరకు గానీ పేకాట చాలించలేదు.

అప్పుడు లేచి, ఉన్నపళంగా ఎవరూ తోడు లేకుండా కేవలం అస్థాన వైద్యుడిని మాత్రం తోడు తీసుకుని బకింగ్‌హాం ప్యాలస్‌కు బయలుదేరారు.

ప్యాలస్‌కు చేరేలోగా వారిద్దరూ ఏం మాట్లాడుకున్నారో గానీ అక్కడ బగ్గీ దిగగానే శ్రీవారికి స్వాగతం ఇచ్చేందుకుగాను గేటువద్ద పడిగాపులు పడుతూవున్న లార్డ్ చాంబర్లేన్‌వంటి పెద్దలు మాత్రం శ్రీవారి వాలకం చూసి ఆగ్రహోదగ్ధులై పోయేరు.

మహారాజావారు ఎలాంటి లాంఛనాల్నీ ధరించి రాలేదు. కనీసం అధికార దుస్తులయినా ధరించలేదు. దానికి తోడు సరిగా నడవగల స్థితిలోకూడా ఉన్నట్టు లేరు. ఆస్థాన వైద్యుడి ఆసరాతో మాత్రమే శ్రీవారు అడుగుతీసి అడుగు వేయగలుగు తున్నారు. అయ్యగారు డోసు ఎక్కువేసి ఇలా బయలుదేరి రాలేదుగదా అనికూడా అనుమానించేరు అక్కడివారు.

చక్రవర్తి సమక్షంలోకి ఆహ్వానితులకే తప్ప వారి పరివారంలోని వారెంతటి వారికైనా ప్రవేశం లేదు.

అయినా తప్పనిసరై మహారాజా వారితో పాటు శ్రీవారి ఆస్థాన వైద్యుడిని కూడా అనుమతించేరు.

ఆ విధంగా మహారాజావారు సకల మర్యాదలనూ కాలదన్ని చక్రవర్తి సమక్షంలోకెళ్ళి పలకరించారు.

చక్రవర్తిగారు న్యాయంగా ఆగ్రహోదగ్రులై శ్రీవారిని మహారాజ పదవినుండి ఊడబీకి ఉండాల్సిందే

కానీ...

"మహాప్రభూ! మా మహారాజావారికి అనుకోకుండా గుండెపోటు వచ్చింది. కదలగూడదని ఎంత చెప్పినా వినకుండా ఏలినవారి దర్శనం చేసుకు తీరాల్సిందేనని ఉన్నపాళంగా బయల్దేరి వచ్చారు" అని ఆస్థాన వైద్యులవారు విన్నవించుకొని మరుక్షణం ఓ ఇంజెక్షన్ తీసి మహారాజా వారికి పొడిచేడు. దాంతో అక్కడున్న వారంతా అప్రతిభులై పోయేరు.

ఔరా! ఈ పాటియాలా మహారాజా వారికి నేనంటే ఎంతభక్తి, గౌరవం. గుండెపోటుతో ఉండికూడా అనుకున్న ప్రకారం నా దర్శనార్థుడై వచ్చేడే!

అని చక్రవర్తిగారు పొంగిపోయేరు. ఇంతసేపూ జరిగిన ఆలస్యానికి పెరిగిన కోపాన్ని మరచిపోయేరు.

మహారాజావారిని స్వయంగా నడిపించి ఓసోఫాలోకూర్చొబెట్టారు. ఇంజక్షన్ ప్రభావంతో కొద్ది నిమిషాల్లో మహారాజావారు మామూలు మనిషవగానే చక్రవర్తిగారు కుశల ప్రశ్నలు వేయటమేగాక భార్యా, బిడ్డలను కూడా పిలిచి మహారాజావారిని పరిచయం చేసేరు. బ్రిటిష్ సింహాసనం పట్ల మహారాజావారికిగల భక్తి గౌరవాల్ని గురించి అందరికీ వర్ణించేరు. ఆ మధ్యాహ్నం అనుకోని విధంగా మహారాజావారికి అక్కడే విందుచేసేరు.

"తమరు సాహిత్యం, వేదాంతం, తత్వశాస్త్రం లాంటి వాటిల్లో ఉద్ధండులనేది నిజమేగానీ... అంతకు మించి మీరు మహానటులు కూడా మహాప్రభూ" అన్నాడాస్థాన వైద్యుడు తిరిగి సవాయ్ హోటల్‌కు చేరిం తర్వాత.... అవునన్నట్లు నవ్వేరు మహారాజావారు.

★